

విద్యతోపాటు వైద్యానికి ప్రాధాన్యం : జెడ్‌పి ఛైర్‌పర్సన్

ఆకివీడు : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యతో పాటు వైద్యానికి సమాన ప్రాధాన్యతనివ్వడంతో ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. మండలంలో ప్రభుత్వం సుమారు రెండు కోట్ల 18 లక్షల రూపాయలతో చినకాపవరం, అప్పారావుపేట, దుంపగడప, చెరుకుమిల్లి, పెదకాపవరం గ్రామాల్లో నిర్మించిన సచివాలయ భవనాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ క్రమంలో రూ.25.80 లక్షలతో చినకాపవరం, సుమారు రూ.24 లక్షలతో అయిభీమవరం గ్రామాల్లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను, రూ.25.80 లక్షలతో చెరుకుమిల్లిలో నిర్మించిన మెడికల్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. అలాగే ఆకివీడులో కోటి 14 లక్షలతో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. పట్టణ ఛైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెపి ఛైర్మన్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యులు వేగేశ్న వెంకటరాజు (ఎండగాని శివ), ఎంపిపి కటారి జయలక్ష్మి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ శ్రీనివాస రెడ్డి, సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఏ స్థానం ఎవరికి..!

టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థులపై వీడని ఉత్కంఠ

ఏడు అసెంబ్లీ, రెండు ఎంపి స్థానాల్లో అభ్యర్థులపై సస్పెన్స్

స్థానాల కేటాయింపుపైనా స్పష్టత కరువు

భీమవరం నాదే అన్న పవన్ వ్యాఖ్యలతో డైలమాలో బిజెపి

రఘు రామకృష్ణంరాజు ఏ పార్టీ నుంచి పోటీలో ఉండేనో?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి, జనసేన, బిజెపి పొత్తు ఖరారైనప్పటికీ అభ్యర్థుల ఎంపికపై గానీ, స్థానాల కేటాయింపుపై గానీ, ఇంకా పూర్తిస్థాయిలో స్పష్టతలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా పార్టీల, నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి పొత్తుతో ఎన్నికల బరిలో దిగుతున్నాయి. తొలి జాబితా కింద ఏడు అసెంబ్లీ స్థానాలకు టిడిపి అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన ఏడు స్థానాల్లో టిడిపి ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందో, జనసేనకు ఎన్ని కేటాయించారో, కొత్తగా పొత్తు కుదిరిన బిజెపికి ఏ స్థానాలు ఇస్తారో ఇప్పటికీ స్పష్టత లేకుండా పోయింది. అంతేకాకుండా నరసాపురం, ఏలూరు ఎంపీ స్థానాల అభ్యర్థులపైనా తేల్చని పరిస్థితి నెలకొంది. కైకలూరు స్థానం నుంచి బిజెపి అభ్యర్థి పోటీచేసే అవకాశం ఉన్నట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. 2014 ఎన్నికల్లో బిజెపి తరపున పోటీచేసి గెలిచి మంత్రిగా కొనసాగిన కామినేని శ్రీనివాస్‌కు మరోసారి టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. తాడేపల్లిగూడెం గానీ, భీమవరం స్థానం ఏదో ఒకటి తమ పార్టీకి కేటాయించాలని బిజెపి పట్టుబడుతున్నట్లు సమాచారం. అదే జరిగితే అసంతృప్తి జ్వాలలు మరింత పెరిగే అవకాశం ఉంది. దెందులూరు టిక్కెట్ టిడిపికి కేటాయిస్తారా లేక మార్పు ఉంటుందో తేలలేదు. దీంతో దెందులూరులో టిడిపి అభ్యర్థిగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చింతమనేని ప్రభాకర్‌కు టిక్కెట్ కేటాయింపు ఉంటుందా అన్న ఉత్కంఠ ఆయన అనుచరుల్లో టెన్షన్ రేపుతోంది. నరసాపురం, ఉంగుటూరు, భీమవరం, పోలవరం, తాడేపల్లిగూడెం స్థానాల్లో జనసేన పోటీ చేయనున్నట్లు చెబుతున్నప్పటికీ ఆపార్టీ నుంచి అధికారికంగా అభ్యర్థుల ప్రకటన మాత్రం వెలువడలేదు. దీంతో ఏస్థానంలో ఎవరు పోటీచేస్తారన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

భీమవరం నాదే అంటూ బిజెపికి కళ్లెమా?

భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు మంగళవారం జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ భీమవరం వదులుకోను.. నాదే అంటూ మాట్లాడిన పరిస్థితి నెలకొంది. భీమవరం నుంచి తాను పోటీచేస్తారా లేదా అన్న విషయం చెప్పకుండా నాదే అన్నట్లు మాత్రమే మాట్లాడారు. పొత్తులో భాగంగా భీమవరం టిక్కెట్ తమ పార్టీకి కేటాయించాలని బిజెపి అడుగుతున్నట్లు తెలిసింది. భీమవరం స్థానం బిజెపికి ఇచ్చేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ సిద్ధంగాలేరని సమా చారం. అందులో భాగంగానే భీమవరం వదులుకోనంటూ బిజెపికి సంకేతాలు పంపేందుకే పవన్ అలా మాట్లాడి ఉంటారన్న చర్చ నడుస్తోంది. జనసేనలో చేరిన పులపర్తి రామాంజనేయులు ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీచేయనని చెప్పడంతో, భీమవరం నాదే అంటూ పవన్ చెప్పడంతో ఆయన ఇక్కడ నుంచే పోటీ చేస్తారన్న అభిప్రాయం నెలకొంది. భీమవరం నుంచి పవన్ పోటీ ఖాయమన్న సంకేతాలు వెలువడడంతో జనసేన కార్యకర్తల్లో జోష్ నెలకొంది.

రఘు రామకృష్ణంరాజు ఏపార్టీ నుంచి పోటీచేస్తారో?

నరసాపురం ఎంపీగా ఉన్న కనుమూరి రఘు రామకృష్ణం రాజు వచ్చే ఎన్నికల్లో ఏపార్టీ నుంచి పోటీచేస్తారో ఎవరికి అర్థం కావడం లేదు. ఇటీవల తాడేపల్లిగూడెం టిడిపి, జనసేన ఉమ్మడి సభలో పాల్గొన్న రఘురామకృష్ణంరాజు మరోసారి నరసాపురం ఎంపీగా పోటీ చేస్తానంటూ ప్రకటించుకున్నారు. వైసిపి నుంచి బయటికొచ్చిన ఆయన ఇప్పటికీ వరకూ ఏపార్టీలోనూ చేరలేదు. నిన్నటి వరకూ టిడిపి తరపున నరసాపురం ఎంపీగా రఘురామకృష్ణంరాజు పోటీచేస్తారంటూ ప్రచారం సాగింది. పొత్తులో భాగంగా నరసాపురం టిక్కెట్ బిజెపికి ఇవ్వనున్నట్లు కొంత స్పష్టత వచ్చింది. రఘు రామకృష్ణంరాజును బిజెపిలోకి చేర్చుకుని ఆపార్టీ నరసాపురం టిక్కెట్ ఇచ్చేందుకు సముఖంగా లేదని తెలుస్తోంది. దీంతో ఆయన ఏపార్టీ నుంచి పోటీ చేస్తారన్న చర్చ నడుస్తోంది. ఏలూరు ఎంపీ స్థానం నుంచి టిడిపి పోటీ చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికీ అభ్యర్థి ఎంపిక పూర్తికాలేదు. టిడిపి తరపున భాష్యం రామకృష్ణ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అంతేకాకుండా టిడిపి సభలకు సంబంధించి ట్రాన్స్‌పోర్ట్ వ్యవహారాలు పరిశీలించే డాక్టర్ పవన్ పేరు పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్న పరిస్థితి నెలకొంది.రెండురోజుల్లో అభ్యర్థుల ఎంపికపై స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది.



ప్రజాశక్తి - భీమవరం

భీమవరాన్ని వదులుకోను..

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పష్టం

ప్రజాశక్తి - భీమవరం



రామాంజనేయులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్‌కళ్యాణ్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భీమవరం నుంచి పోటీపై ఎట్టకేలకు స్పష్టత వచ్చింది. భీమవరాన్ని వదులుకోను.. నాదేనని ఆయన చేసిన వ్యాఖ్యలు పవన్ పోటీకి బలాన్ని చేకూర్చింది. భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, ఆయన కుమారుడు ప్రశాంత్ జనసేన తీర్థం పుచ్చుకున్నారు. భీమవరం నుంచి మంగళగిరి భారీ ర్యాలీతో వెళ్లిన వారికి పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భీమవరం నియోజకవర్గ ముఖ్యనేతలతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. రామాంజనేయులు చేరిక పార్టీకి కీలకం అన్నారు. ఎంఎల్ఎగా ఓడిన వ్యక్తిని కూడా ముందుకు తీసుకెళ్లడంలో కీలకంగా మారారన్నారు. గత ఎన్నికల్లో తాను గెలిచి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్నారు. 2019 ఎన్నికల్లో ఓడినా జనం గుండెల్లో స్థానం మరింత బలాన్నిచ్చిందన్నారు. జగన్ తాలూకా జలగలను తీసి పారేయాలన్నారు. భీమవరంలో ఉండే జలగలతో సహా వీధి రౌడీని ఎంఎల్ఎను చేస్తే ఏ స్థాయికి వస్తుందో అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. పార్టీ పెట్టడానికి సొంత అన్నను కాదని బయటికొచ్చానని చెప్పారు. భీమవరాన్ని వదలని, అది నాది అని వ్యాఖ్యానించరు. గతం నుంచి భీమవరంలో పోటీ చేస్తున్నట్లు ప్రచారంలో ఉన్నప్పటికీ తరువాత పిఠాపురం, గాజువాక, తిరుపతి స్థానాల నుంచి పవన్ పోటీ చేస్తున్నట్లు ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో ఈ ప్రచారానికి పవన్ ఫుల్‌స్టాప్ పెట్టి భీమవరం నాదే వదులు కోనని చెప్పడంతో ఇక్కడి నుంచే పవన్ పోటీలో ఉంటారని ఆ పార్టీ రాజకీయ ప్రముఖులు చెబుతున్నారు.

పవన్ అవకాశం ఇస్తే పోటీ చేస్తా : మాజీ ఎంఎల్ఎ రామాంజనేయులు

మూడు పార్టీల పొత్తుతో 2014 విజయాన్ని మరోసారి అందుకుంటామని భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. పవన్‌కళ్యాణ్ సమక్షంలో మంగళవారం అంజిబాబు జనసేనలో చేరారు. జనసేన కండువా కప్పుకున్న అనంతరం అంజిబాబు మాట్లాడారు. పవన్ నాయకత్వంలో కలిసి పనిచేయడం మనందరి అదృష్టమన్నారు. పవన్ కళ్యాణ్ అవకాశం ఇస్తే భీమవరం నుంచి పోటీ చేస్తానని తెలిపారు. భీమవరంలో జనసేన జెండాను ఎగరవేస్తామని, పవన్ కళ్యాణ్‌కు పూర్తి మద్దతు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, చిన అమిరం మాజీ సర్పంచి బుద్ధవరపు శ్రీనివాస్ రాజు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మెరగాని నారాయణమ్మ, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'తానేటి' తాయిలాలు..!

ఎన్నికల ప్రలోభాలకు దిగిన హోంమంత్రి తానేటి వనిత

అక్రమాలను అరికట్టాల్సిన శాఖా మంత్రి తీరుపై చర్చ

అంగన్‌వాడీలు,ఆశాలు, వాలంటీర్లు, ఇతర ఉద్యోగులకు ద్వారకాతిరుమలలో గిఫ్ట్‌ల పంపిణీ

ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అధికారపార్టీ నాయకుల ఆత్మీయ సమావేశం ముసుగు

అధికారులే దగ్గరుండి తీసుకెళ్తున్న దుస్థితి



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికలు సజావుగా జరపాల్సిన బాధ్యత పోలీస్‌శాఖపై ప్రధానంగా ఉంటుంది. ఆ శాఖను సన్మార్గంలో నడిపించాల్సిన హోంమంత్రి తానేటి వనిత ఓటర్లను ప్రలోభపెట్టేందుకు గిఫ్ట్‌లు పంపిణీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆత్మీయ సమావేశం ముసుగులో అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు పెద్ద ఎత్తున చిరుద్యోగులకు గిఫ్ట్‌లు పంపిణీ చేస్తున్న పరిస్థితి జిల్లాలో యథేచ్ఛగా కొనసాగుతోంది. దీనికి అధికార యంత్రాంగం సైతం సహకరిస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, వాలంటీర్లు వంటి ఇతర చిరుద్యోగులతో మంత్రి తానేటి వనిత సోమవారం ద్వారకాతిరుమలలోని ఓ కళ్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు రావాలంటూ అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ఇతర చిరుద్యోగులందరినీ పిలిచి రాత్రి తొమ్మిది గంటల వరకూ అక్కడే ఉండేలా చేశారు. ఈ సందర్భంగా ఇటీవల అంగన్‌వాడీ వర్కర్లు చేసిన సమ్మెపై విమర్శలు చేయడమే కాకుండా, వైసిపికి ఓట్లు వేయాలంటూ అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, వాలంటీర్లు, ఇతర చిరుద్యోగులకు గిఫ్ట్‌లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికీ ప్లాస్క్‌లు, డిన్నర్ సెట్లు గిఫ్ట్‌లుగా అందజేశారు. దాదాపు వెయ్యి మందికిపైగా ఈ సమావేశానికి హాజరైనట్లు చెబుతున్నారు. ఐసిడిఎస్, ఇతర శాఖలకు చెందిన అధికారులే దగ్గరుండి ఆ శాఖల్లో పనిచేసే ఉద్యోగులను వైసిపి నాయకులు నిర్వహించే ఆత్మీయ సమావేశాలకు తీసుకెళ్తున్న పరిస్థితి నెలకొంది. గిఫ్ట్‌లు పంపిణీ చేస్తున్నట్లు అధికారులకు తెలిసినప్పటికీ వారే దగ్గరుండి పంపిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. అధికారులు రాజకీయ నాయకుల మాదిరిగా ఆత్మీయ సమావేశాల్లో మాట్లాడుతున్న పరిస్థితి నెలకొంది. ఎన్నికల ప్రలోభాలను అడ్డుకోవాల్సిన హోంశాఖ మంత్రే బహిరంగంగా ఎన్నికల తాయిలాలు పంపిణీ చేయడం చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే మహిళా ఓటర్లే లక్ష్యంగా అధికార పార్టీ నాయకులు తాయిలాలు పంపిణీ చేస్తున్న పరిస్థితి. కొద్దిరోజుల క్రితం ఏలూరు వైసిపి నాయకులు వాలంటీర్లకు, మెప్మా ఆర్‌పిలకు సెల్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఆచంట, పాలకొల్లు వంటి పలు నియోజకవర్గాల్లోనూ డ్వాక్రా మహిళలకు చీరలు పంపిణీ చేసిన పరిస్థితి. ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న తాయిలాల పంపిణీని అడ్డుకోవాల్సిన అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు.

బిజెపి విధానాలను తిప్పికొట్టాలి

14న చలో ఢిల్లీ జయప్రదానికి రైతు, కార్మిక సంఘం నేతల పిలుపు

ప్రజాశక్తి - భీమవరం



భీమవరంలో..

దేశానికి అన్నం పెట్టే రైతాంగం నరేంద్ర మోడీ ప్రభుత్వానికి దేశద్రోహుల్లా, ఉగ్రవాదుల్లా కనిపించడం అవివేకమని రైతు కార్మిక సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్నరోజుల్లో బిజెపి విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14న ఢిల్లీలో జరుగుతున్న రైతాంగ పోరాటాన్ని జయప్రదం చేయాలని రైతు కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రచార యాత్ర భీమవరంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నేతలు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, గొర్ల రామకృష్ణ, ఇంజేటి శ్రీనివాస్, పట్టణ పేదల సంక్షేమ సంఘం నాయకులు ఎం.వైకుంఠరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు వరలక్ష్మి, శేషపు ఆశ్రియ, బి.సూర్యచంద్ర, డేగల నాగు, నారాయణమూర్తి, త్రిమూర్తులు, శ్యాంబాబు పాల్గొన్నారు.

పాలకోడేరు : ఈ నెల 14న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజాసంఘాల ప్రచార యాత్ర పిలుపునిచ్చింది. విస్సాకోడేరు, పెన్నాడ, శృంగవృక్షం, వేంద్ర, పాలకోడేరు, గొల్లలకోడేరు గ్రామాల్లో ప్రచారం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నేతలు రామకృష్ణ, ఆంజనేయులు, ఎం.వైకుంఠరావు మాట్లాడారు.

ఉండి : మండలంలో మంగళవారం సాయంత్రం జిల్లా ప్రచార యాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండి మెయిన్ సెంటర్‌లో నిర్వహించిన యాత్రలో సిఐటియు నాయకులు జెఎన్‌వి.గోపాలన్, సత్యనారాయణ, ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, నాయకులు గొర్ల రామకృష్ణ, మాదాసి గోపీ, వీరవల్లి మాధవరావు, కురిటి సోమేశ్వరరావు, మజ్జి నాగేశ్వరరావు, రామకూరి వెంకటరత్నం, చిట్టి అన్నవరం పాల్గొన్నారు.

తణుకు రూరల్ : ప్రభుత్వాసుత్రి, నరేంద్ర సెంటర్, మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అడ్డగర్ల అజయకుమారి, మండలాధ్యక్షులు ఎన్.ఆదినారాయణబాబు, కార్యదర్శి గుబ్బల గోపీ, మందులయ్య, మంగతాయారు, కృష్ణబాబు, శ్రీను, పి.నాగేంద్ర, వెంకన్న, కె.నరేష్ పాల్గొన్నారు.

వీరవాసరం : ప్రచార యాత్ర వీరవాసరం చేరుకున్న సందర్భంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం తప్ప ప్రజలకు ఏ ఒక్క మంచి పని చేయలేదన్నారు.



తణుకులో..

ఆచంట : ఆచంట నియోజవర్గస్థాయిలో సిఐటియు రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, రైతు, కౌలు రైతు, వ్వసాయ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు కర్షకులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెంలో జీపు జాతా ప్రచార యాత్ర ర్యాలీని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు స్థానిక పోలీసు ఐ ల్యాండ్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రైతు సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, జీపు ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు.

నరసాపురం : నరసాపురంలో నిర్వహించిన ప్రచార యాత్రలో రైతు, కౌలు రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు సిహెచ్.బాబూరావు, ఎం.రామాంజనేయులు, బి.జార్జి, జె.శ్రీనివాస్ మాట్లాడారు. నరసాపురం మండలంలోని సరిపల్లి, లిఖితపూడి, కొప్పర్రు, మల్లవరం, మల్లవరంలంక గ్రామాల మీదుగా యలమంచిలి మండలం, పాలకొల్లు మండలాల్లో యాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.త్రిమూర్తులు, జె.రాము, పి.నారాయణరావు, పి.పూర్ణ, టి.బాలరాజు కె.శ్రీనివాస్, డి.సుధాకర్ పాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలిలో నిర్వహించిన ప్రచారా యాత్రలో రైతు, కౌలురైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు సిహెచ్.బాబూరావు, ఎం.రామాంజనేయులు, బి.జార్జి, జె.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ యాత్ర యలమంచిలి మండలం ఉటాడ, చించినాడ, మేడపాడు, అడవిపాలెం, కొంతేరు మీదుగా పాలకొల్లు మండలంలో కొనసాగుతుందని తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా అజిత వేజెండ్లతో కలిసి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్స్, ప్రాంతాల గుర్తింపు, ముందస్తు చర్యలపై జిల్లాలోని ఆర్ఒలు, ఎఇఆర్ఒలు (తహశీల్దార్లు), నియోజకవర్గ ఇఆర్ఒలు, పోలీసు అధికారులు, తదితరులతో సమీక్షించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు అనుకూలమైన వాతావరణానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఇప్పటికే కొన్ని సున్నితమైన, సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లను గుర్తించారని, గత ఎన్నికల సమయాల్లో జరిగిన గొడవలు, ప్రలోభాలు, మతపరమైన ఘర్షణలు, రాజకీయపరమైన ఘర్షణలు, ఫిర్యాదులు, ఓటర్లను భయభ్రాంతులు చేయడం పరిగణలోకి తీసుకుని సమీక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ బి.శివనారాయణ రెడ్డి, జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు, సెబ్ ఎఎస్‌పి ఎటివి రవికుమార్, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలి

సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - తణుకు రూరల్



బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల బాండ్లను రద్దు చేయాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. సిపిఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక వేల్పూరు ఎస్‌బిఐ వద్ద సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి అనంతరం బ్యాంకు మేనేజర్ బి.శరత్‌గోపాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల వివరాలన్నింటినీ తప్పనిసరిగా బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎస్‌బిఐ తక్షణం అమలు చేయాలన్నారు. ఎన్నికల బాండ్ల లావాదేవీలకు సంబంధించి వివరాలు మార్చి 13 కల్లా ఎన్నికల కమిషన్ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేస్తే జూన్ 30 వరకు మరికొంత సమయం కావాలని ఎస్‌బిఐ తిరిగి కోర్టును ఆశ్రయించడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, తిరునాదం వెంకటేశ్వరరావు, వాటాల నాగేశ్వరరావు, కుడకా వీరభద్రరావు, విశ్వనాథం, సుబ్బారావు, మల్లేశ్వరపు నాగరాజు పాల్గొన్నారు.

తీర ప్రాంత గ్రామాల్లో రహదారుల అభివృద్ధి

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

తీర ప్రాంత గ్రామాలను అనుసంధానం చేస్తూ రహదారులను అభివృద్ధి చేస్తున్నామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పాతపాడులో రూ.27.6 లక్షలతో తాగునీటి సరఫరాభివృద్ధి పనులకు శంకుస్థాపన, పేరుపాలెం సెంటర్‌లో రూ.28 కోట్లతో నిర్మాణం చేపట్టిన ముత్యాలపల్లి-మోళ్లపర్రు, పేరుపాలెం - కెపి.పాలెం రహదారికి శంకుస్థాపన, పేరుపాలెం బీచ్‌లో రూ.4.80 కోట్లతో నిర్మించిన సీసీ ప్రారంభోత్సవం, మెట్రేవు నుంచి మోళ్లపర్రు వరకు రూ.8 కోట్లతో నిర్మించే సిసి రహదారికి శంకుస్థాపన కార్యక్రమాలను ఆయన చేశారు. ఈ సందర్భంగా పేరుపాలెంలో ఆయన మాట్లాడుతూ 18 కిలోమీటర్లు ఉన్న తీర ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. పేరుపాలెం బీచ్‌ను దేశంలోనే గ్రేడ్-2 బీచ్‌గా గుర్తించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తిరుమని విజయలక్ష్మి, కడలి సోంబాబు, కొప్పడి తులసిమహేశ్వరరావు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, బండి ముత్యాలమ్మ ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, నాయకులు పాల్గొన్నారు.

శివ కార్యాలయంలో టిడిపి ఫ్లెక్సీల తొలగింపు

రసవత్తరంగా ఉండి రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం



ఫ్లెక్సీలు తొలగిస్తున్న శివ అనుచరులు

ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) భీమవరం పార్టీ కార్యాలయంలో టిడిపి ఫ్లెక్సీ బ్యానర్లను శివ అనుచరులు మంగళవారం సాయంత్రం తొలగించారు. సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజుకు మరోసారి టిడిపి అధిష్టానం ఉండి ఎంఎల్ఎ టిక్కెట్‌ను కేటాయించడం తెలిసిందే. అయితే టిక్కెట్ ఆశించిన శివరామరాజుకు పరాభవం ఎదురు కావడంతో మనోవేదనకు గురైన ఆయన అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. ఇదిలా ఉంటే శివరామరాజు టిడిపికి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా లేక వైసిపి నుంచి పోటీ చేస్తారని కొన్నిరోజులుగా ప్రచారం సాగుతుంది. ఈ నేపథ్యంలోనే శివరామరాజు కార్యాలయంలో ఫ్లెక్సీలు తొలగించడం తీవ్ర చర్చనీయాంశమైంది. తొలగించిన ఫ్లెక్సీల స్థానంలో శివ స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన ఫ్లెక్సీ బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఉండిలో పదేళ్ల పాటు ఎంఎల్ఎగా పని చేసిన శివరామరాజు రానున్న రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు తీసుకునే నిర్ణయం పట్ల ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఒకపక్క సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు, మరోపక్క టిడిపి అధిష్టానం నిర్ణయంతో విభేదించిన శివరామరాజు ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారనే దానిపై చర్చ సాగుతుంది. ఈ నేపథ్యంలో ఉండి రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. టిడిపికి కంచుకోటగా ఉన్న ఉండిలో ఈసారి ఎన్నికలతో పెను మార్పులు సంభవించే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఉండి రాజకీయం రసవత్తరంగా మారింది.

ప్రజాశక్తి
www.prajasakti.com

రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - ఆకివీడు

కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ నెల 14న చలో ఢిల్లీ జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిర్వహించిన బహిరంగ సభలో సిఐటియు జిల్లా నాయకులు ఆంజనేయులు మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.తవిటినాయుడు, బి.వరలక్ష్మి, ఎస్.సూరిబాబు, డి.రవితేజ, బి.రాంబాబు పాల్గొన్నారు.

ఎన్నికల కంట్రోల్ రూమ్ విధులు పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల కంట్రోల్ రూమ్ విధులను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎన్నికల కంట్రోల్ రూమ్ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంట్రోల్ రూమ్‌లో ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, టోల్ ఫ్రీ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వార్తల మానిటరింగ్, తదితర సేవలకు సంబంధించి పలు శాఖల నుంచి అధికారులను, సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఐటి (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సభ్యుల పాత్ర చాలా కీలకమన్నారు. ఐటీ టీం సభ్యులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో జరిగే సంఘటనలను ఆన్‌లైన్ ప్రక్రియలో నమోదు చేయాలని చెప్పారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

ప్రజాశక్తి - నరసాపురం

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు మంగళవారం జరిగాయి. నరసాపురంలో ఆదిత్య, శ్రీవైఎన్ డైమండ్ జూబ్లీ, శ్రీ సూర్య, ఉమెన్స్, గౌతమి, భాస్కరా కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. బిజెబిఎస్ ఉమెన్స్ కళాశాలలో 304 విద్యార్థులకు 284 మంది విద్యార్థులు హాజరయ్యారు. 20 మంది గైర్హాజరయ్యారు.

ఎన్నికల ఖర్చుపై పర్యవేక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల ఖర్చుపై పర్యవేక్షణ తప్పనిసరిగా చేయాలని ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో శివన్నారాయణరెడ్డి వివిధ ట్రేడ్ యూనియన్లతో సమావేశమై ఎన్నికల ఖర్చు లెక్కింపునకు రేట్ చార్ట్ నిర్ణయంపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల అభ్యర్థులు ఖర్చును రేట్ చార్ట్ ప్రకారం నిర్ణయించి వారి ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు తదితరాలకు వినియోగించే వాహనాలు, షామియానాలు, ఆహారం అన్నింటిని రేట్ చార్ట్‌లో నిర్దేశించిన రేట్ల ప్రకారం అభ్యర్థుల ఖాతాలో లెక్కలు రాయనున్నట్లు తెలిపారు.

వెంపటాపునకు కళాతపస్వి పురస్కారం

ప్రజాశక్తి - తణుకు రూరల్

మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ మచిలీపట్నంలో నిర్వహించిన కళాతపస్వి దామెర్ల రామారావు జయంతి, ఉమెన్స్ డే వేడుకల్లో భాగంగా తణుకుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ వెంపటాపునకు కళాతపస్వి దామెర్ల రామారావు పురస్కారాన్ని అందించారు. 30 ఏళ్ళ చిత్రకళా రంగానికి చేసిన సేవలు గుర్తించి తనకు ఈ అవార్డు అందించారని మంగళవారం వెంపటాపు తెలిపారు. వెంపటాపునకు కళాతపస్వి దామెర్ల అవార్డు రావడం పట్ల తణుకు జెడ్‌పి బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.పద్మావతి, జిజె.ప్రభువరం, సిబ్బంది, స్వగ్రామం ఇరగవరం, తణుకు పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు వీవర్స్ కాలనీ పిహెచ్‌సి పరిధిలోని జివిఎన్‌విఆర్‌ఎం కొత్తపేట మున్సిపల్ పాఠశాల, బివిఆర్‌ఎం హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం అయోడిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీవర్స్ కాలనీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ హెన్నా మాట్లాడుతూ జాతీయ అయోడిన్ డిజార్డర్, డెఫిషియన్సీ శాంపిల్ సర్వేలో భాగంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.

నరసాపురం డిఎస్‌పిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం డిఎస్‌పిగా గంటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న రవిమనోహర్‌చారి తిరుపతి ఎసిబి డిఎస్‌పిగా నియమితులయ్యారు.

'వాలంటీర్లు సైన్యంలా పనిచేయాలి'

ప్రజాశక్తి - ఆచంట

వాలంటీర్లందరూ వైసిపికి, సిఎం జగన్‌కు ప్రయివేట్ సైన్యంలా పనిచేయాలని ఎంపిటిసి సభ్యులు కర్రి అనురాధా జోగిరెడ్డి అన్నారు. మండలంలోని అయోధ్యలంకలో మంగళవారం నిర్వహించిన వాలంటీర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాలంటీర్ వ్యవస్థను దేశంలో పలు రాష్ట్రాలు కొనియాడుతున్నాయన్నారు.

రూ.85 వేల కోట్లతో రైల్వే ఆధునికీకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రధాని మోడీ భారతీయ రైల్వే ఆధునికీకరణలో భాగంగా రూ.85 వేల కోట్లకు పైగా రైల్వే ప్రాజెక్టులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతికి అంకితం చేశారని పాలకొల్లుకు చెందిన రైల్వే బోర్డు సభ్యులు జక్కంపూడి కుమార్ తెలిపారు. తణుకు రైల్వే స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో భారీ తెరపై ప్రారంభోత్సవాలను వీక్షించినట్లు ఆయన తెలిపారు. పది వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఇతర రైలు సేవలకు జెండా ఊపి ప్రారంభించారన్నారు. తణుకు రైల్వే వారు పాఠశాల స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన బాలబాలికలకు బహుమతి ప్రదానం చేసినట్లు చెప్పారు.

డైమండ్స్ లయన్స్ క్లబ్‌కు పలు అవార్డులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ఉత్తమ క్లబ్ అవార్డులు పొందినట్లు ఆర్‌సి లయన్ మదన్‌మోహన్ తెలిపారు. అగర్వాల్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన రీజయన్ మీట్‌లో తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్‌కు అనేక అవార్డ్స్ వరించాయన్నారు. బెస్ట్ జోన్ పర్సన్‌గా లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, బెస్ట్ ప్రెసిడెంట్‌గా లయన్ కొప్పిశెట్టి రమణయ్య, బెస్ట్ క్లబ్‌గా డైమండ్స్ లయన్స్ క్లబ్‌కు అవార్డులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

గీతాంజలి మృతికి కారకులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - ఉండి

గీతాంజలి మృతికి కారణమైన ఐటిడిపి, జనసేన పార్టీకి చెందిన సోషల్ మీడియా కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సూరవరపు వెంకటాచార్యులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి ఉండి మెయిన్ సెంటర్లో గీతాంజలి చిత్రపటానికి నివాళులర్పించి కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటాచార్యులు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, వైసిపి పట్టణ అధ్యక్షులు అంబటి రమేష్, మున్నలూరి శ్రీనివాసరావు, గళావిల్లి ధనుంజయ మాట్లాడారు. ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, పార్టీ గ్రామ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జున, నాయకులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

రోడ్డు ప్రమాదంలో ఇకరు మృతి చెందగా, మరొకరు గాయాలపాలయ్యారు. రెండు బైక్‌లు పెనుమంట్ర తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆర్అండ్‌బి రహదారిలో ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పెనుమంట్ర తహశీల్దార్ కార్యాలయం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బ్రాహ్మణ చెరువు గ్రామానికి చెందిన కడలి గోవింద్, మరో గుర్తు తెలియని వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గోవింద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


సంపూర్ణ అభివృద్ధే లక్ష్యం

'ఉండి' మరోసారి గెలిచి చంద్రబాబుకు కానుకగా ఇస్తా

ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గ సంపూర్ణ అభివృద్ధే తన లక్ష్యమని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు స్పష్టం చేశారు. మరోసారి ఎంఎల్‌ఎగా గెలిచి నియోజకవర్గంలో సమస్యలన్నిటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వివరించారు.



ప్రశ్న : మీరు రాజకీయాల్లోకి రావడానికి కారణం?

2006లో చంద్రబాబుపై ఇష్టంతో తెలుగుదేశం పార్టీలో చేరారు.కలవపూడి సహకార బ్యాంకు అధ్యక్షులుగా రెండు పర్యాయాలు, డిఎన్ఆర్ కళాశాల పాలకవర్గ సభ్యులుగా మూడు పర్యాయాలు చేశాను. సీ గ్రేడ్‌లో ఉన్న సహకార బ్యాంకును ఎ గ్రేడ్‌కు తీసుకొచ్చాను. పార్టీ ఆదేశంతో 2019 ఎన్నికల్లో ఎంఎల్ఎగా పోటీ చేసి గెలుపొందాను.

ప్రశ్న : మీ నియోజకవర్గంలో ఆధునికీకరణ పనుల పరిస్థితి ఏమిటి?

కాలువ (ఇరిగేషన్) అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని అనేక సార్లు కోరాను. వరి సాగుకు ఇబ్బంది లేకుండా కాలువల్లో ఉన్న గుర్రపుడెక్క, తూడు తొలగింపునకు, కాలువల అభివృద్ధికి ఇరిగేషన్ నిధులు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం మంజూరు చేయలేదు. నియోజకవర్గంలో ఎక్కడా పూర్తిస్థాయిలో ఆధునికీకరణ పనులు చేపట్టలేదు. పనులు చేయకుండానే కాలువలకు నీటిని వదిలి అటు సాగు... ఇటు తాగునీటికి ఇబ్బందికర పరిస్థితులు తీసుకొచ్చారు.

ప్రశ్న : టిడిపి సీనియర్ నేత మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు (కలవపూడి శివ) నుంచి ఏ సహకారం ఆశిస్తున్నారు? ఆయన వైఖరిపై మీ స్పందన ఏంటి?

ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా తనకు టిక్కెట్ ఖరారయ్యాక మాజీ ఎంఎల్‌ఎ శివను రెండు సార్లు కలిశాను. తన గెలుపునకు సహకరించాలని కోరారు. ఆయన తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కృషి చేస్తారని ఆశిస్తున్నాను.



ప్రశ్న : వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణం మీ నియోజకవర్గంలో ఎలా ఉంది?

వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న కాలనీలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా తీసుకున్నప్పటికీ ఆ కాలనీల్లో సవాలక్ష సమస్యలు వెంటాడుతున్నాయి. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రుణం రూ.1.80 లక్షలు. వాస్తవానికి ఖర్చయ్యేది రూ.15 లక్షలు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు అప్పు చేసి ఇల్లు నిర్మించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పైగా కాలనీలో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రశ్న : ఆక్వా రైతుల ఇబ్బందులేమిటి? వైసిపి ప్రభుత్వ సహకారం ఎలా ఉంది? రైతుల అభ్యున్నతికి ఏమి చేశారు?

వైసిపి ప్రభుత్వ హయాంలో ఆక్వా, వరి రైతులకు ఇబ్బందులు తప్ప లాభాలేమీ లేవు. ఆక్వా రైతులు తీవ్ర ఒడి దుడుకుల నడుమ సాగు చేస్తున్నారు. వైరస్, వైట్‌కట్, ఇహెచ్‌పి వంటివి ఆక్వా సాగులో తరచూ తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు తీవ్ర నష్టాల్లో కురుకుపోతున్నారు. రొయ్యలు, చేపల మేత ధరలు పెరగడంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం అందించే విద్యుత్ రాయితీ కూడా రైతులందరికీ అందని పరిస్థితి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మూడు నుంచి నాలుగు రెట్లు పెంచేశారు. ధాన్యానికి కనీస మద్దతు ధర లభించడం లేదు.

ప్రశ్న : గ్రామాల్లో తాగునీటి సమస్యపై మీ అభిప్రాయం ఏంటి?

నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గత టిడిపి హయాంలో 90 ఆర్ఒ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. 50 ఆర్ఒ ప్లాంట్లు వినియోగంలో లేవు. ఆర్ఒ ప్లాంట్ల పునరుద్ధరణ పల్లిపాలెం గ్రామంలో, కోపల్లె హైస్కూలులో ఏర్పాటు చేశాం. రానున్నరోజుల్లో పూర్తిస్థాయిలో ఆర్ఒ ప్లాంట్లు వినియోగంలోకి తీసుకొస్తాం.

ప్రశ్న : కరోనా సమయంలో గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి సహాయ సహకారాలు అందించారు?

ఉండి నియోజకవర్గంలో కరోనా వల్ల పనులు లేక ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న పేదలకు గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, నా వ్యక్తిగతంగా నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశాం. నియోజకవర్గంలో రూ.4.50 లక్షల మందికి ఆనందయ్య మందు తయారుచేసి ప్రతి ఇంటికి అందించాం.

ప్రశ్న : ప్రతిపక్షంలో మీ పాత్ర?

అయిదేళ్లుగా వైసిపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక నిర్ణయాలపై అవిశ్రాంత పోరాటం చేశాను. అధ్వాన రహదారులు, పెరిగిన నిత్యావసర ధరలు, కరెంటు బిల్లులపై ఆందోళన కార్యక్రమాలు, ధర్నాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేశాను. మిచౌంగ్ తుపాను సమయంలో సహాయ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపాను.

ప్రశ్న : ఈ ఐదేళ్ల పదవి కాలంలో అసెంబ్లీలో ఏ సమస్యలపై మాట్లాడారు?

ఈ ఐదేళ్లల్లో అసెంబ్లీలో మూడు సార్లు మాత్రమే మాట్లాడే అవకాశం వచ్చింది. నియోజకవర్గంలో వెయ్యి మంది పేదలు ఇళ్లు నిర్మించుకున్నారు. రూ.10 కోట్ల విలువైన హౌసింగ్ బిల్లులు అందడం లేదని అసెంబ్లీలో ప్రస్తావించాను. ఆక్వాసాగులో ఫీడ్, సీడ్ చట్టాల్లో ఉన్న లోపాలు సరి చేస్తే ఆక్వా రైతులకు మేలు జరుగుతుందని కోరాను. రెవెన్యూ శాఖలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసెంబ్లీలో ప్రస్తావించాను. రైతులకు పూర్వం నుంచి మాజీ సైనికులు, రాజకీయ బాధితుల భూములను 22ఎలో నమోదు చేశారు. దీంతో బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు, క్రయ విక్రయాలు చేసేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే 22ఎ నుంచి తొలగించాలని కోరాను.

ప్రశ్న : ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటి?

ప్రతిపక్షంలో ఉన్న నేను ప్రత్యర్థి (టిడిపి) పార్టీకి చెందినవాడిని కాబట్టి వైసిపి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఉండిలో మరింత అభివృద్ధి సాధించలేకపోయాను. పలు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎంపీ నిధులతో కొంతమేరకు పనులు చేశాం. ఆశించిన విధంగా అభివృద్ధి పనులు జరగలేదు. ఎంఎల్ఎకు రూ.రెండు కోట్లు ఇస్తే మంజూరైన నిధులు వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది.

ప్రశ్న : నియోజకవర్గ అభివృద్ధికి మీ ప్రణాళికలు?

ఉండి నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత నివారణ చర్యలు చేపట్టి ప్రతి ఇంటికి నీరందిస్తాం. నియోజకవర్గంలో సాగు, మురుగు కాలువల్లో ప్రతి ఏటా పంటల సాగుకు ముందే పూడికలు తీయించి మరమ్మతులు పూర్తి చేయించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ ఎటువంటి షరతులు లేకుండా రూ.1.50 పైసలకు అందిస్తాం. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రాయితీలపై అందించి ఆక్వా రైతులను ఆదుకుంటాం.

ప్రశ్న : రాజకీయ జీవితంలో క్లిష్టమైన సందర్భాలున్నాయా?

ప్రజలచేత ఎన్నుకోబడిన ఎంఎల్ఎకు నిధులు కేటాయించకపోవడం క్లిష్టమైన పరిస్థితి. నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తానని భావించాను. వైసిపి ప్రభుత్వం నియోజకవర్గ ఇన్‌ఛార్జిని నియమించింది. నిధులు కేటాయించలేదు. రాష్ట్ర ప్రభుత్వం విధానం సరిగా లేదు.

ప్రశ్న : ప్రచారంలో ప్రజల నుంచి మీకు స్పందన ఎలా ఉంది?

ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుంది. ఏ గ్రామానికి వెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారు.

ప్రశ్న : చేయాల్సిన అభివృద్ధి పనుల పరిస్థితి ఏమిటి?

నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరిన వంతెనల స్థానంలో కొత్త వంతెనల పున:నిర్మించాలి. వెంకయ్యవయ్యేరు పంట కాలువలో రూ.30 కోట్ల ప్రాజెక్టు వినియోగంలోకి తీసుకురావాలి. ఉప్పుటేరు ఆధునికీకరణ పనులు చేపట్టాలి. ఆర్ఒ ప్లాంట్ల పున:నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

ప్రశ్న : నియోజకవర్గ ప్రజలకు మీరిచ్చే సందేశం?

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నా, యువతకు ఉపాధి అవకాశాలు దక్కాలన్నా, సంక్షేమ పథకాల అమలుతో పాటు నిరుపేదలు, మధ్యతరగతి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమవుతుంది.

ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఆకివీడు

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో పలుచోట్ల ఐద్వా సభ్యులు సంఘ ప్రాధాన్యతను వివరించారు. పలుచోట్ల సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. సమాఖ్య పట్టణ కార్యదర్శి సంధక ఉదయ కుమారి నాయకత్వంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు పలువురు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక బిజెబిఎస్ ఉమెన్స్ కళాశాల నుంచి ఆదికవి నన్నయ యూనివర్సిటీ నిర్వహించిన డిగ్రీ ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. బిఎ, బీకామ్, బిఎస్‌సి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపల్ సి.నీరజ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు మరింత ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు.

బాలుని చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు సబ్బేవారిపేటకు చెందిన బద్దా ఇందిర కుమారుడు కిందపడడంతో తలకు గాయామైంది. ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్సకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. గత ఐదేళ్ల నుంచి అప్పులు చేసి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఆమె వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపిని కలిసి సమస్యను వివరించారు. గోపీ ఈ సమస్యను సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఏలూరు సిద్ధం సభా ప్రాంగణంలో ఆమెను తీసుకెళ్లి జగన్‌కు సమస్య వివరించారు. జగన్ అప్పటికప్పుడు రూ.లక్ష చెక్కును అందించారు. మంగళవా రం ఆమె కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును గోపీ అందిం చారు.

కళాశాలలో ఓటరు చైతన్య సభ

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక శ్రీ దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో ఓటరు చైతన్య సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యులు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి మాట్లాడారు. సమాజాన్ని శాసించేది ఓటర్లని, ప్రజా సంక్షేమం, సామాజిక సమానత్వం, మహిళాభ్యున్నతికి కృషి చేసే మంచి నాయకులను ఎన్నుకోవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి అధ్యక్షత వహించగా పద్మావతి, రాజకుమారి, మంగతాయారు పాల్గొన్నారు.

రిజిస్టర్లు, రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో చింతపర్రు హెల్త్, వెల్‌నెస్ సెంటర్‌లో ఎన్‌హెచ్‌ఎం టాస్క్ ఫోర్స్ టీం వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై రికార్డులు, రిజిస్టర్లు మంగళవారం పరిశీలించారు. ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, హెచ్‌ఎంఐఎస్, ఆర్‌సిహెచ్ రికార్డులను ఎస్ఒ విశ్వేశ్వరప్రసాద్ పరిశీలించారు. డిపిహెచ్ఎన్ ఒ వెంకటరత్నం హైస్కూల్‌లో 30 మంది విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు చేశారు. స్కూల్‌కు వెళ్లిన గర్భిణులకు కూడా రక్తహీనత పరీక్షలు చేశారు. రక్తహీనత తక్కువగా ఉన్నవారు పోషకాహారం, ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధి కారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ ఎలిజిబెత్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, సూపర్‌వైజర్లు ఎస్‌కె.అమలేశ్వరరావు, డి.కమల, ఎంఎల్‌హెచ్‌పిలు ఎస్.శ్రావణి, కృష్ణవేణి, ఎఎన్ఎం అనిత పాల్గొన్నారు.

వనిత క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక లయన్స్ క్లబ్ ఆడిటోరయంలో పాలకొల్లు వనిత క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యులు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి హాజరయ్యారు. ప్రతి కుటుంబంలో అబ్బాయితో సమానంగా అమ్మాయిని వివక్ష చూపకుండా వారి అభిరుచికి తగ్గట్టు ఉన్నతంగా పెంచాలన్నారు. మరొక ముఖ్య అతిథి దాసరి నారాయణరావు, మహిళా కళాశాల ప్రిన్సిపల్ పిల్లి శోభారాణి మాట్లాడుతూ ప్రతి మహిళా విద్యావంతురాలు అయితేనే ఆ కుటుంబం ఉన్నత స్థితికి చేరుకుంటుందన్నారు. అనంతరం ప్రయివేట్ ఆసుపత్రుల్లో రోగులకు వైద్య సేవలు చేసిన 40 ఏళ్ల అనుభవం ఉన్న నర్సులు కోలాటి మరియమ్మ, కిమిడి అనసూయ, ధనలక్ష్మి, మండెల మంగతాయారులను క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్ చేతుల మీదుగా సత్కరించారు. ప్రెసిడెంట్ మంగిన అరుణ, సెక్రటరి యామన విజయలక్ష్మి మాట్లాడారు. వారం రోజులుగా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందించారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి : ఎంఎల్‌ఎ మంతెన

ప్రజాశక్తి - కాళ్ల

తెలుగుదేశం, బిజెపి, జనసేన కలయికతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. ఆయన స్వగ్రామం కలవపూడి గ్రామంలో ఇంటింటికి టిడిపి బాబుతో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి, బిజెపి, జనసేన శ్రేణులతో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలవపూడిగ్రామంలో మంతెన పెదనరసింహరాజు ఇంటి నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ కలవపూడిలో చుట్టూ నీరు ఉన్నా తాగడానికి స్వచ్ఛమైన నీరు దొరకని పరిస్థితి ఉందన్నారు. జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో కేటాయించిన నిధులను సైతం వైసిపి రద్దు చేయడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, జనసేన పార్టీ మండలాధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, కలవపూడి గ్రామ సర్పంచి గేదల జాన్, మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు, అడ్డాల శివరామరాజు, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గణపవరం :పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా స్థానిక వడ్డిగూడెం అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త బండారు పార్వతి మాట్లాడుతూ ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి 23 వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కేంద్రంలో పిల్లలకు, గర్భిణులకు, తల్లులకు పౌష్టికాహారం అందించనున్నట్లు తెలిపారు.

పొత్తులతో వచ్చిన వారిని చిత్తుగా ఓడించాలి

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

రానున్న ఎన్నికల్లో బిజెపి, జనసేన, టిడిపిలు పొత్తులతో వస్తున్నాయని, ఆ పార్టీలను చిత్తుగా ఓడించాలని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. పాలకోడేరులో జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణరాజు(చంటి రాజు) ఆధ్వర్యంలో మంగళవారం రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, ఈ అభివృద్ధి కొనసాగాలంటే ఎన్నికల్లో తనను ఎంఎల్ఎగా గెలిపించాలని కోరారు. నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ వైసిపికి ప్రజలు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి ఎఎంసి వైస్ ఛైర్మన్ చేకూరి రాజానరేంద్రకుమార్, సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, వైసిపి మండల కన్వీనర్ కటిక శ్రీదేవి, కోఆప్షన్ సభ్యురాలు డాక్టర్ డిఆర్.స్వర్ణలత, సర్పంచుల ఇంజేటి మరియమ్మ, జంగం సూరిబాబు, జిల్లా అనూష సత్యనారాయణ, కడలి నాగేశ్వరి, ఎంపిటిసి సభ్యులు పాల జ్యోతి, నాగలక్ష్మి, స్వాతి, షేక్ పాప సాహెబ్ పాల్గొన్నారు.


భూ హక్కు పత్రాలు అందిస్తున్న పివిఎల్

ఉండిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి - ఉండి

జగనన్న ఆరోగ్య సురక్షతోనే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఏర్పడుతుందని ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. ఉండి గ్రామంలో సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపిపి పరిశీలించి మాట్లాడారు. అనంతరం గ్రామంలోని గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించారు.

ఉచిత వైద్య శిబిరం

పెనుగొండ :మండలంలోని వడలి గ్రామంలో జెడ్‌పి హైస్కూల్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నాలుగో రోజులో భాగంగా ఈ శిబిరం నిర్వహించినట్లు ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల అధ్యపకులు కె.చిరంజీవి తెలిపారు.

బాలికల కిడ్నాపర్లు వచ్చారంటూ వదంతులు

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షంలో మంగళవారం జరిగిన ఓ ఘటన కలకలం రేపింది. బాలికల కిడ్నాపర్లు వచ్చారంటూ ఒక్కసారిగా వదంతులు వ్యాపించాయి. దీనికి తోడు కిడ్నాపర్ల వ్యవహారం పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. ఈ నేపథ్యంలో శృంగవృక్షంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. వివరాల ప్రకారం... ఇద్దరు బాలికలకు సోషల్ మీడియాలో విజయవాడకు చెందిన మరో ఇద్దరు యువకుల మధ్య పరిచయం ఏర్పడింది. వీరిని కలుసుకునేందుకు విజయవాడ నుంచి వచ్చిన యువకులు బాలికలతో కలిసి ఆటోలో వెళ్లే ప్రయత్నంలో స్థానికులు పట్టుకున్నారు. చిన్న పిల్లలను కిడ్నాప్ చేసేందుకు వచ్చారంటూ ఆ ఇద్దరు యువకులను స్థానికులు పట్టుకుని వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. ఒక యాప్‌లో ఛాటింగ్ చేస్తూ పరిచయమయ్యారు. ఇదే గ్రామానికి చెందిన మరో యువకుడు ఆ ఇద్దరు యువకులతో ఆన్‌లైన్ గేమ్స్ ఆడి రూ.ఐదు వేలు బాకీ అయ్యాడు. బాకీ నగదు వసూలు చేసుకుని అప్పటికే పరిచయమైన ఆ ఇద్దరు బాలికలతో మాట్లాడారు. శృంగవక్షం నుంచి భీమవరం వైపు వెళు తున్న ఆటో ఎక్కుతుండగా స్థానికులు గమనించి అడ్డుకున్నారు. పిల్లల కిడ్నాపర్లుగా భావించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆ ఇద్దరు యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.